ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

గురువారం 11-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 360 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్




**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో 8మంది చనిపోగా.. ఇవాళ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మరొకరు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం రోజు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు మృతుల కుటంబాలను పరామర్శించారు.ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.. బాధితులకు పరిహారం అందజేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మంత్రి లోకేష్ 24 గంటలు గడవకముందే మృతుల కుటుంబాలకు పరిహారం అందజేశారు. లోకేష్ ముందుగా తక్షణ పరిహారం కింద రూ. 25 లక్షల రూపాయలు అందజేస్తామని హామీ ఇచ్చారు.. చెప్పినట్లుగానే బాధిత కుటుంబ సభ్యులకు రూ. 25 లక్షల చెక్‌లు అందించారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్, ఏఐసీసీ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్‌కు మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో ఊహించని షాక్ తగిలింది. ఆమె దాఖలు చేసిన నామినేషన్ పత్రాన్ని స్క్రూటీనీ అనంతరం రిటర్నింగ్ అధికారి మంగళవారం తిరస్కరించారు. తెలంగాణలో తనపై ఉన్న ఒక వివాదాస్పద కేసు వివరాలను, ఆస్తుల సమాచారాన్ని అఫిడవిట్‌లో మీనాక్షి నటరాజన్ ఉద్దేశపూర్వకంగా దాచారని ప్రతిపక్ష బీజేపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ తిరస్కరణ దేశవ్యాప్తంగా రాజకీయ సంచలనంగా మారగా.. నామినేషన్ రిజక్ట్ కావటానికి కారణమైన కేసు వివరాలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి.

వాస్తవానికి మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి ప్రత్యక్ష క్రిమినల్ నేరారోపణలు లేవు. కానీ న్యాయస్థానంలో దాఖలైన ఒక క్రిమినల్ పిటిషన్‌కు సంబంధించి ఆమెకు కోర్టు నుంచి సమన్లు జారీ అయ్యాయి. ఈ కేసు నేపథ్యం ఒక మహిళా వేధింపుల వివాదంతో ముడిపడి ఉంది. నారాయణపేట జిల్లా కాంగ్రెస్ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఒక మహిళను లైంగికంగా వేధించడంతో పాటు, చంపుతానని బెదిరించారనే ఆరోపణలపై గతంలో 2022లో పంజాగుట్టలో, 2023లో బెంగళూరులోని కుబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా తిరస్కరణకు గురైంది.

బాధిత మహిళ నిందితుడైన శివకుమార్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని అప్పటి రాష్ట్ర ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, ప్రస్తుత ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రస్తుత మంత్రి వాకిటి శ్రీహరిల చుట్టూ తిరిగారు.




# గ్రేటర్ గద్దెపై రేవంత్ గురి!




- గ్రేటర్ గెలుపే రేవంత్ టార్గెట్
- హైదరాబాద్‌లో కాంగ్రెస్ దూకుడు
- నవంబర్ పోరుకు మాస్టర్ స్కెచ్
- క్యూర్‌లో పట్టు కోసం భారీ ఆపరేషన్
- బీజేపీ-బీఆర్ఎస్‌కు చెక్ పెట్టే ప్లాన్
- ప్రతి బూత్‌పై కాంగ్రెస్ కన్ను
- ఎన్నికల ముందు అభివృద్ధి దండయాత్ర
- క్యాడర్‌లో జోష్ నింపే వ్యూహం
- హైదరాబాద్ కోటపై కాంగ్రెస్ గురి
- గ్రేటర్‌లో గెలుపే ఒక్కటే ఎజెండా
- రేవంత్ ఎలక్షన్ వార్‌రూమ్ యాక్టివ్
- మూడు కార్పొరేషన్లపై సీఎం కన్ను
- ఎన్నికల బరిలో కాంగ్రెస్ కసరత్తు
- గ్రేటర్ సమరానికి రేవంత్ సన్నద్ధం

**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** నవంబరులో గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ నెల 15 నుంచి ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం సెప్టెంబర్ చివరన ముగియనుంది. అక్టోబరు 1న ఫైనల్ ఓటరు లిస్టును ఈసీ ప్రకటించనుంది. ఆ వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితా ప్రకారం ఆ మూడు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాల్లో డిస్కషన్ జరుగుతున్నది. అందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వరసగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నట్టు చర్చ జరుగుతున్నది.

**దసరా తర్వాత షెడ్యూల్**

ఓటర్ల జాబితా అందిన తర్వాత కార్పొరేటర్లు, మేయర్ల రిజర్వేషన్లను మున్సిపల్ శాఖ ఫైనల్ చేయనున్నది. ఈ ప్రక్రియ అంత ముగిసేందుకు కనీసం మూడు వారాల సమయం పడుతుంది. అక్టోబర్ 18న బతుకమ్మ, 20 దసరా కావడంతో.. ఆ పండుగలు ముగిశాక ఎన్నికల సంఘం గ్రేటర్ హైదరాబాద్, మల్కాజిగిరి, సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసి నవంబరు మొదటి లేదా రెండోవారంలో ఎన్నికల నిర్వహించే అవకాశం ఉందని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి వెల్లడించారు.

**క్యూర్‌లో పట్టుకోసం ప్లాన్**

సీఎం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఔటర్ రింగ్ రోడ్డు పరిధిని క్యూర్ ఏరియాగా ఏర్పాటు చేసి, ఆ ప్రాంతాన్ని మూడు మున్సిపల్ కార్పొరేషన్లను విభజించారు. అక్కడ రాజకీయంగా పట్టు సాధించేందుకు ఇప్పటి నుంచే ఆయన వ్యూహాలు రచిస్తున్నట్టు టాక్. ఈ మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ చాలా వీక్‌గా ఉన్నది. ఈ పరిధిలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే సీటూ గెలవలేదు. ఆ తర్వాత జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించింది. అయినా ఆశించిన స్థాయిలో పార్టీ బలోపేతం కాలేదని టాక్.

మిగతాది 2 లో..

## ప్రధాని మోడీకి కేంద్ర క్యాబినెట్ ‘స్టాండింగ్ ఒవేషన్’

### ప్రత్యేక తీర్మానం ఆమోదం!




## ఆగస్టు 8న హైదరాబాద్‌లో ఇండియా కూటమి భేటీ




## దేశంలో అతిపెద్ద డేటా సెంటర్

### చేతులు కలిపిన రిలయన్స్, మెటా




**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** భారతీయ సాంకేతిక రంగంలో ఒక భారీ ముందడుగు పడింది. సోషల్ మీడియా దిగ్గజం ‘మెటా ప్లాట్‌ఫార్మ్స్’, దేశీయ కార్పొరేట్ దిగ్గజం ‘రిలయన్స్ ఇండస్ట్రీస్’ సంయుక్తంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఒక అత్యాధునిక ఏఐ-ఎనేబుల్డ్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించాయి.

## కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

### ఆర్డినరీ సర్వీసులకు కేబినెట్ ఆమోదం

**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** ఇటీవల పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇచ్చిన హామిల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామి ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం విజయం సాధించింది. దీంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు కేఎస్ఆర్‌టీసీ ఆర్డినరీ సర్వీసులకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి వీడి సతీషన్ ఈ రోజు ప్రకటించారు. ఈ మేరకు ప్రతి సంవత్సరం ఇందుకోసం రూ. 800 కోట్లు అవసరం పడతాయని సీఎం స్పష్టం చేశారు.




దీంతో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తరహాలోనే కేరళ ప్రభుత్వం కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన రాష్ట్రాల్లో చేరింది.అయితే కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కి చెందిన కేవలం ఆర్డినరీ బస్సు సర్వీసులలో ప్రాథమికంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించే ప్రతిపాదనకు కేరళ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వి.డి. సతీశన్ మీడియాకు వెల్లడించారు.

## క్యూబాలో 150 ఏండ్లలోనే అత్యంత భారీ భూకంపం



# గ్రేటర్ గద్దెపై రేవంత్ గురి!

మొదటి పేజీ తరువాయి




ఈ విషయాలను దృష్టిలో పెట్టుకున్న సీఎం రేవంత్.. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరయ్యేందుకు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తున్నది. అందుకే కొత్త కార్యాలయాలకు భూమి పూజలు, అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు చేస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. అందులో భాగంగానే ఈ మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో బలంగా ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌పై సీఎం ఎటాక్ చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెందిన నేతలు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. మొత్తంగా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపేందుకు సీఎం రేవంత్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తున్నది.

కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు

క్యూర్ ఏరియాలో పార్టీని బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టేందుకు షెడ్యూలు రెడీ చేసుకున్నట్టు తెలిసింది. జులై నుంచి ఆ మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని స్థానిక లీడర్లతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి, కేడర్‌ను యాక్టివ్ చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఒక్కో పోలింగ్ బూత్‌కు కనిష్ఠంగా పది మంది యాక్టివ్ కార్యకర్తలను ఎంపిక చేసి, ఆ బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి, వారి సమస్యల పరిష్కార బాధ్యతలను అప్పగించాలని భావిస్తున్నట్టు తెలిసింది. అలాగే యాక్టివ్ కార్యకర్తలను గుర్తించి, వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలనే యోచనలో సీఎం ఉన్నట్టు సమాచారం.

## ప్రధాని మోడీకి కేంద్ర క్యాబినెట్ 'స్టాండింగ్ ఒవేషన్'.. ప్రత్యేక తీర్మానం ఆమోదం!



**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** భారతదేశంలో నిరంతరాయంగా అత్యంత సుదీర్ఘ కాలం పాటు పదవిలో కొనసాగుతూ, సరికొత్త చారిత్రాత్మక రికార్డు సృష్టించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని కేంద్ర క్యాబినెట్ ఘనంగా కొనియాడింది. ఈ అద్భుతమైన మైలురాయిని పురస్కరించుకుని బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని మోడీని అభినందిస్తూ ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులందరూ లేచి నిలబడి, చప్పట్లతో ప్రధాని మోదీకి 'స్టాండింగ్ ఒవేషన్' ఇచ్చి తమ గౌరవాన్ని చాటుకున్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ వేదికపై అసాధారణ వృద్ధిని సాధించిందని, ఈ 4,399 రోజుల సుదీర్ఘ పాలన దేశ ప్రగతి పథంలో ఒక సువర్ణ అధ్యాయమని కేంద్ర మంత్రివర్గం కొనియాడింది.

## కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆర్డినరీ సర్వీసులకు కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి




ఈ పథకం ద్వారా కేరళలోని లక్షలాది మంది మహిళలకు, ముఖ్యంగా నిరుపేద, ఉద్యోగ, కార్మిక మహిళలకు ఎంతో ఆర్థిక ఉపశమనం కలగనుంది. అయితే, ఈ పథకాన్ని కేవలం ఆర్డినరీ బస్సులకే పరిమితం చేయకుండా.. ఇతర సర్వీసులకు కూడా విస్తరించాలని, అలాగే ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న కేఎస్ఆర్టీసీని గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయిస్తుందనే దానిపై విపక్ష నేత వి.డి. సతీశన్ అసెంబ్లీ వేదికగా మీడియా ద్వారా చర్చ లేవనెత్తారు. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక జీవో త్వరలోనే విడుదల కానుంది.

## రేవంత్ రెడ్డి పాలనలో శాంతిభద్రతలు గాడి తప్పాయి: కవిత



**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** రేవంత్ రెడ్డి పాలనలో శాంతిభద్రతలు గాడి తప్పాయని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత, మాజీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. నిత్యం ఆడబిడ్డలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ పోస్టులో ఆమె విమర్శలు కురిపించారు. ఖమ్మం నగరంలో 12ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టి, ఆమెను నాలుగో అంతస్తు నుండి తోసేసి హత్య చేయాలని ప్రయత్నించిన ఘటన కలచివేసిందన్నారు. జిల్లా కేంద్రంలో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయంటే మారుమూల ప్రాంతాల్లో మహిళలు, బాలికల భద్రతపై ఆందోళన వ్యక్తం అవుతోందని పేర్కొన్నారు. పోలీసులు వేగంగా దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా హైదరాబాద్ మహా నగరంలోని మల్కాజిగిరిలో భార్యను తుపాకీతో భర్త కాల్చి చంపడం అత్యంత దారుణం అని పేర్కొన్నారు. మూడు నెలల క్రితమే సదరు వ్యక్తి బహిరంగంగా తుపాకీతో బెదిరింపులకు పాల్పడినప్పుడే అరెస్ట్ చేసి ఉంటే ఈరోజు నిండు ప్రాణం బలి అయ్యేది కాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పడానికి, రేవంత్ రెడ్డి పాలనపై పట్టు కోల్పోయారని చెప్పడానికి ఈ ఘటన సాక్ష్యంగా నిలుస్తోందన్నారు. భార్యను హత్య చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని, ఈ ఘటనకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## క్షమాపణలు చెప్పిన తర్వాతే జగన్ బెంగళూరు వెళ్లాలి: మంత్రి నారా లోకేశ్ డిమాండ్



**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన అగ్నిప్రమాదం లో మొత్తం 9 మంది మృతి చెందారు. మరో ఐదుగురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మరోవైపు ఈ ఘటన రాజకీయ దుమారం రేపింది. బాధితులను పరామర్శించి ఈ ఘటనకు కారణం తమరంటే తమరని వైసీపీ, టీడీపీ నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కి మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. విశాఖ ఉక్కును తాము రెండుసార్లు కాపాడామని, అది తమ చరిత్ర అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కును గత ప్రభుత్వంలో జగన్ విధ్వంసం సృష్టించిందని, మూడో రాజధాని అంటూ భూములు కొట్టేయాలని యత్నించారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ వల్ల కాలుష్యం అంటూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు., స్టీల్ ప్లాంట్ కార్మికులకు క్షమాపణ చెప్పి ఆ తర్వాత జగన్ బెంగళూరు వెళ్లాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

మొదటి పేజీ తరువాయి



శివకుమార్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామని మీనాక్షి నటరాజన్ చెప్పినప్పటికీ.. దానికి సంబంధించిన ధ్రువపత్రాన్ని ఇవ్వడానికి నిరాకరించారని సదరు మహిళ ఆరోపించారు. పైగా.. బెయిల్ రద్దయిన నిందితుడిని పార్టీ కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించారని, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్నికరెడ్డితో కలిసి ఆయన ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్టీ పరంగా తనకు న్యాయం జరగకపోవడంతో బాధితురాలు గత ఏడాది ఆగస్టు 28న హైదరాబాద్‌లోని నాల్గవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిందితుడిపై చర్యలు తీసుకోనందుకు గాను మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్నికరెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని తనకు రూ.10 కోట్ల నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన న్యాయస్థానం.. మీనాక్షి నటరాజన్‌తో పాటు ఇతరులకు సమన్లు జారీ చేసింది. రాజ్యసభ నామినేషన్ అఫిడవిట్‌లో ఈ కోర్టు సమన్ల సమాచారాన్ని పేర్కొనకపోవటమే నామినేషన్ తిరస్కరణకు ప్రధాన కారణమైంది.

ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ఓటమికి భయపడి బీజేపీ కుట్రపూరితంగా ఈ పని చేయించిందన్నారు. నోటీసు ఇస్తే సమాధానం ఇచ్చేవాళ్లమని ఈ విషయాన్ని కోర్టులోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు. ఇలా ప్రత్యక్షంగా ఏ కేసులో లేకుండానే మీనాక్షీ నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ అయింది. ఆమె ఎంపీ స్థానానికే ఎసరు పెట్టింది. పాపం మీనాక్షీ నటరాజన్ పదవి వచ్చినట్లే వచ్చి తృటిలో చేజారిపోయింది.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదం

## మృతుల కుటుంబాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేష్

మొదటి పేజీ తరువాయి



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు, క్షతగాత్రులకు రూ. 10 లక్షలు పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే మృతిచెందిన ఒక్కో రెగ్యులర్ ఉద్యోగి కుటుంబానికి అన్ని ప్రయోజనాలు కలుపుకొని రూ. 1.72 కోట్లు, ఒప్పంద ఉద్యోగికి రూ. 45 లక్షల పరిహారం అందుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. అంతేకాదు ఈ ప్రమాదంలో చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆ కుటుంబాల్లో పిల్లలు ఉంటే వారిని చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. చనిపోయినవారు ఒప్పంద ఉద్యోగులైనా, శాశ్వత ఉద్యోగులైనా కుటుంబ సభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామన్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రమాదంలో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య 9కి చేరింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిరా ఇవాళ ఉదయం చనిపోయినట్లు అధికారులు తెలిపారు. ఇటు స్టీల్‌ప్లాంట్ ప్రమాదానికి కారణాలపై విచారణ చేసేందుకు కేంద్ర ఉక్కుశాఖ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ త్రిసభ్య కమిటీలో బొకారో సెయిల్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి ప్రియరంజన్, సెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ జితేంద్రకుమార్, సెయిల్ విశ్రాంత సీజీఎం గోపాల్‌సింగ్ ఉన్నారు. ఈ కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించింది.. మరో రెండు రోజుల పాటూ విశాఖపట్నంలోనే ఉండి ప్రమాదన కారణాలపై ఆరా తీయనుంది.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం కారణంగా దాదాపు రూ. 120 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. రెండు రోజుల పాటూ రోజుకు 8వేల టన్నుల చొప్పున ఉత్పత్తి నిలిచిపోయింది.. దీని వల్ల రూ. 100 కోట్లు నష్టం ఉంటుందంటున్నారు. యంత్రాలు, మిగిలిన సామాగ్రి నష్టం రూ. 20 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉక్కు పరిశ్రమలోని ఎస్ఎంఎస్-1లో మిషన్2 ఆగిపోయింది.. మిగిలిని ఐదు మిషన్లతో పనిచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## ఆగస్టు 8న హైదరాబాద్‌లో ఇండియా కూటమి భేటీ




**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ద్వారా పార్టీకి నష్టం వాటిల్లకుండా చూసేందుకు ఏఐసీసీ దృష్టిసారించింది. అందులో భాగంగా వచ్చే ఆగస్టు 8న హైదరాబాద్ లో జరగబోయే ఇండియా కూటమి సమావేశం పార్టీకి బూస్ట్ ఇవ్వనుందని నేతలు భావిస్తున్నారు. తాజాగా ఢిల్లీలో ఈనెల 8న సమావేశమైన ఇండియా కూటమి నేతలు అనేక కీలక అంశాలపై చర్చించారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలపై 23 పార్టీలు నుంచి 35 మంది ప్రతినిధులు హాజరై చర్చించారు.

అందులో ప్రధానంగా ఎస్ఐఆర్ పై గందరగోళం, ఓట్ల తొలగింపుపై చర్చ నడిచింది. మోసపూరిత ఎన్నికలపై సుప్రీంకోర్టు చీఫ్?జస్టిస్ కు లేఖ రాస్తామని ఏఐసీసీ చీఫ్?మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీలు కాంగ్రెస్ తో కలిసి నడుస్తున్నాయి. ఇటీవల తమిళనాడులో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'డీఎంకే' కూటమి నుంచి వైదొలగింది. 'ఆప్' పంజాబ్ లో కాంగ్రెస్ కు ప్రత్యర్థిగా భావిస్తున్నందున ఆ పార్టీ సైతం కూటమికి దూరంగా ఉంటుంది.

ఎస్ఐఆర్ పై అభ్యంతరాలు

రాష్ట్రంలో జరగబోయే ఎస్ఐఆర్ ప్రక్రియపై తమకున్న అభ్యంతరాలను ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. ఈ మేరకు సీఈసీకి తమ అభ్యంతరాలు, సూచనలు, అభిప్రాయాలతో కూడిన వినతిపత్రాన్ని ఇటీవలే టీపీసీసీ చీఫ్? మహేశ్ కుమార్ గౌడ్ అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో ఇటీవల ఎన్నికలు జరిగిన బెంగాల్ లో 90 లక్షలు ఓట్లను తొలిగించడం ద్వారా ఫలితాలు తారుమారు అయ్యాయని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఏడాది పాటు వాయిదా వేయాలని, ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియకు కనీసం మూడు నెలల సమయం, బీఎల్ఓలు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించాలన్న డిమాండ్లను ఇప్పటికే టీపీసీసీ ఈసీ ముందు పెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే కాంగ్రెస్ బీఎల్ఏల నియామకం చేపట్టడంతో పాటు వారికి శిక్షణ కార్యక్రమాలను ట్రైనర్ ద్వారా అందిస్తున్నారు. సాంకేతిక, క్షేత్రస్థాయి విధివిధానాలపై సమగ్రమైన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నారు.

త్వరలో ఎన్నికలు

ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆయా రాష్ట్రాల్లో కూటమి సమావేశాలను నిర్వహించాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. అందులో భాగంగానే హైదరాబాద్ లో భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, గ్రేటర్ హైదరాబాద్, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఐదారు నెలల్లో ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికలకు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్ లో ప్రతిపక్ష పార్టీల అధినేతలు హాజరయ్యే సమావేశం కాంగ్రెస్ పార్టీకి మరింత బూస్ట్ ఇస్తుందన్న ఆశాభావంతో హస్తం నేతలు ఉన్నారు. దీంతో ఇండియా కూటమి సమావేశం, ఆ తర్వాత జరిగే పరిణామాలపైనా రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## దేశంలో అతిపెద్ద డేటా సెంటర్...చేతులు కలిపిన రిలయన్స్, మెటా

మొదటి పేజీ తరువాయి



మెటా సంస్థ భారతదేశంలో ఏర్పాటు చేయబోతున్న మొట్టమొదటి ఏఐ డేటా సెంటర్ ఇదే కావడం గమనార్హం. ఈ ఒప్పందంలో భాగంగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ జామ్‌నగర్‌లో అధునాతన మౌలిక సదుపాయాలతో కూడిన డేటా సెంటర్‌ను నిర్మించగా, మొదటి దశలో 168 మెగావాట్ల సామర్థ్యం గల ఈ కేంద్రాన్ని మెటా పూర్తిగా లీజుకు తీసుకోనుంది. భవిష్యత్తులో అవసరాలకు అనుగుణంగా దీని సామర్థ్యాన్ని మరింత పెంచుకునేలా ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాబోయే రెండేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గ్రీన్ ఎనర్జీ.. సముద్రపు నీటితో కూలింగ్

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో రూపకల్పన చేస్తున్నారు. ఈ డేటా సెంటర్ నిర్వహణకు అవసరమైన విద్యుత్‌ను 100% గ్రీన్ ఎనర్జీ ద్వారానే అందిస్తారు. అంతేకాకుండా, సర్వర్ల కూలింగ్ ప్రక్రియ కోసం భూగర్భ జలాలను వాడకుండా, సముద్రపు నీటిని శుద్ధి చేసే అత్యాధునిక సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నారు.

భారతీయ వినియోగదారులకు సూపర్ స్పీడ్ సర్వీసెస్

భారత్‌లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు కోట్లాది మంది వినియోగదారులు ఉన్నారు. ఈ డేటా సెంటర్ అందుబాటులోకి వస్తే, భారతీయ యూజర్ల డేటా స్థానికంగానే ప్రాసెస్ అవుతుంది. దీనివల్ల ల్యాటెన్సీ తగ్గి, మెటా ఏఐ ఫీచర్లు, రీల్స్, వాయిస్ అసిస్టెంట్ సేవలు అత్యంత వేగంగా అందుతాయి. అలాగే భారత ప్రభుత్వ 'డేటా లోకలైజేషన్' చట్టాలకు అనుగుణంగా యూజర్ల డేటా భద్రత మరింత పటిష్టం కానుంది. జియో, మెటా భాగస్వామ్యంలో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ దేశీయ ఏఐ విప్లవానికి సరికొత్త దిశను చూపించనుంది.

## ఆఫ్ఘనిస్తాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులు.. 11 మంది పిల్లలతో సహా 13 మంది మృతి!



**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ మధ్య సరిహద్దు వివాదాల నేపథ్యంలో మరోసారి ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఆఫ్ఘనిస్తాన్ భూభాగంపై పాకిస్తాన్ సైన్యం సరిహద్దు దాటి వైమానిక దాడులకు పాల్పడిందని ఆఫ్ఘన్ ప్రభుత్వం సంచలన ఆరోపణలు చేసింది. అసోసియేటెడ్ ప్రెస్ నివేదికల ప్రకారం.. ఈ దారుణ దాడిలో కనీసం 13 మంది పౌరులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఇటీవల కాలంలో ఇరు దేశాల మధ్య జరిగిన అత్యంత ఘోరమైన ఘర్షణల్లో ఇది ఒకటిగా నిలిచింది.

సాధారణ పౌరులే లక్ష్యంగా బాంబుల వర్షం

పాకిస్తాన్ సైన్యం మరోసారి ఆఫ్ఘనిస్తాన్ వైమానిక పరిధిని ఉల్లంఘించిందని, సరిహద్దుకు సమీపంలోని కునార్, ఖోస్ట్, పక్తికా ప్రాంతాల్లోని సామాన్య పౌరుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని బాంబుల వర్షం కురిపించిందని ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వ అధికారిక ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ క్షిపణి దాడుల ధాటికి ఇళ్లు ధ్వంసమై 11 మంది అమాయక పిల్లలు, ఒక మహిళ, ఒక వృద్ధుడు మరణించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి చివర్లో ఇరు దేశాల మధ్య జరిగిన ఘర్షణల తర్వాత సరిహద్దు కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్నప్పటికీ, తాజా దాడితో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే ఇరు దేశాల ఘర్షణల వల్ల 372 మంది ఆఫ్ఘన్ పౌరులు మరణించగా, 397 మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి గత నెల విడుదల చేసిన నివేదికలో పేర్కొనడం గమనార్హం.

# అమరావతికి కేంద్రం వరాలు

## రూ.2534 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్.. కేబినెట్ ఆమోదం



**న్యూస్ డెస్క్,10 జూన్ (ఇది కద నిజం):** ఏపీ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాజధాని అమరావతికి కీలక ప్రాజెక్టులను ప్రకటించింది. రూ. 2,534 కోట్లతో అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్, జీపీఆర్ఏ ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి నిర్మాణం కోసం సీపీడబ్ల్యూడీ కేంద్ర మంత్రివర్గానికి ప్రతిపాదనలు పంపగా.. బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో ఇందుకు ఆమోదం లభించింది. ఇందులో భాగంగా రూ.1,299.08 కోట్లతో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కాంప్లెక్స్, రూ.1,234.91 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం నివాస సముదాయం (జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామిడేషన్ కాంప్లెక్స్) నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ భవనంలో కొలువుదీరనున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం మల్టీస్టోరేజ్ నివాసాలు నిర్మించనున్నారు.

మరోవైపు అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టు కోసం 22.53 ఎకరాలను సీఆర్‌డీఏ ఇప్పటికే కేటాయించింది. 5.53 ఎకరాల్లో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్, 17 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయం నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వీటి నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్ కూడా పూర్తి అయ్యింది. మరోవైపు అమరావతిలో ఇప్పటికే పలు కేంద్ర ప్రభుత్వ విభాగాలు, వాటి అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ అద్దె భవనాల్లో నడుస్తుండగా సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం పూర్తి అయితే ఇవన్నీ కూడా సెక్రటేరియట్ కాంప్లెక్స్ భవనంలోకి మారనున్నాయి.

సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టును పర్యావరణ హితంగా.. గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, కాన్ఫరెన్స్ హాల్స్ , పార్కింగ్ సౌకర్యాలు కల్పించనున్నారు.. మొత్తంగా సెంట్రల్ సెక్రటేరియట్ భవనం రాజధాని అమరావతికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ప్రభుత్వ విభాగాలు అన్నీ ఒకేచోటకు చేరటం ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, అన్ని సేవలూ కూడా ప్రజలకు ఒకే చోట లభిస్తాయని అధికారులు చెప్తున్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదం లభించటంతో ఇప్పుడు ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరగనుంది.

# నవాబ్‌పేట్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

**హెల్మెట్ మీ ప్రాణాలకు రక్షణ కవచం.. రోడ్డు భద్రతపై రాజీ వద్దు" -- ఐజీ షా నవాజ్ ఖాసీం**

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహా మేహ్రా**

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రజలకు పిలుపు**

**హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత -- ఐజీ షా నవాజ్ ఖాసీం**





ఇది కద నిజం,నవాబుపేట్: రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పోలీస్ శాఖ ఐజీ షా నవాజ్ ఖాసీం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహా మేహ్రా, ఇతర పోలీస్ అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ షా నవాజ్ ఖాసీం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని, హెల్మెట్ కేవలం చలానాల నుంచి తప్పించుకోవడానికి కాదని, ప్రాణాలను రక్షించుకునేందుకు అవసరమని తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం పూర్తిగా మానుకోవాలని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించి కుటుంబ సభ్యులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా ఎస్పీ స్నేహా మేహ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మరియు ప్రజలు రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, సూచనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత చైతన్యం పెరిగిందని, ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని అధికారులు కోరారు.

# టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు



ఇది కద నిజం, కుక్కునూరు: మండలానికి చెందిన పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో వీళ్ళందరికీ కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మలిశెట్టి నాగేశ్వరరావు (నాగు) పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ, తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, కుక్కునూరు మండల అధ్యక్షుడు నాయకత్వం నచ్చి సైకిల్ ఎక్కినట్లు వారు తెలిపారు. అలాగే, రానున్న స్థానిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు అన్నారు. పార్టీలో చేరిన వారిలో మాచర్ల వెంకటేశ్వర్లు, ఎండీ మస్తాన్, షేక్ మహబూబ్, విలాసాగరపు విశ్వనాథం, పాశం ప్రసాద్, కర్నాటి చంద్రం, దుక్కిపాటి సత్యం, షేక్ ఖాదర్ బాబు, సంగెపు పెంటయ్య, షేక్ హుస్సేన్, సమీర్ పాషా ఉన్నారు.

## ప్రజలంతా ఓటు హక్కును

# పరిరక్షించుకోవాలి

**- టీడీపీ అధ్యక్షుడు ములిశెట్టి నాగు**





ఇది కద నిజం, కుక్కునూరు: ప్రజలంతా ఓటు హక్కును పరిరక్షించుకోవాలి అని, అందుకోసం ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) పిలుపునిచ్చారు. అయన ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఇందులో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పాల్గొని ఓటరు జాబితాల పరిశీలన, నమోదు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ములిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎంతో ముఖ్యమని అన్నారు. ఓటర్లందరూ తమ వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ా×= కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# పిట్లం గ్రామసభలో అభివృద్ధి పనులపై చర్చ

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 10: పిట్లం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, విద్యుత్ స్తంభాలు మరియు ప్రమాదకర ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమాల విజయానికి ప్రజల సహకారం అత్యంత అవసరమని సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గ్రామసభలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తాం

**సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర**



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి అనుకూలమైన ప్రదేశానికి మార్చేందుకు చర్యలు తీసుకుంటామని పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ తెలిపారు. గడ్డం బాలు ఇంటి సమీపంలో రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కాలనీ వాసులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో స్తంభాన్ని త్వరలోనే మరో అనుకూల ప్రదేశానికి మార్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అత్యవసర సేవల వాహనాలు, భారీ వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీ వాసులు సర్పంచ్ స్పందనపై హర్షం వ్యక్తం చేస్తూ, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించి విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించి ఇతర ప్రాంతానికి మార్చాలని విజ్ఞప్తి చేశారు.

# అరైవ్-అలైవ్ కార్యక్రమంలో హెల్మెట్ల పంపిణీ

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బిక్నూర్, జూన్ 10: కామారెడ్డి జిల్లా కలెక్టర్ అషిష్ సంఘ్వాన్, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బిక్నూర్ మండలంలో "అరైవ్-అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ హెల్మెట్లను పంపిణీ చేశారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పవద్దని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 100/112 నంబర్లకు కాల్ చేయాలని అవగాహన కల్పించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జిలు హెడ్ కానిస్టేబుళ్లు రామంచ తిరుపతి, శేషరావు, పీసీలు ప్రభాకర్, సాయిలు పాటలు, నాటికల ద్వారా ప్రజలకు సందేశాలు అందించారు. కార్యక్రమంలో బిక్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐ ఆంజనేయులు, పోలీసు సిబ్బంది, సర్పంచ్ రేఖ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశానికి అందిస్తున్న విశేష సేవలకు కృతజ్ఞతగా హైదర్‌గూడలో ప్రత్యేక పూజలు



ఇది కద నిజం, అత్తాపూర్:భారత ప్రధాని నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాలుగా దేశానికి అందిస్తున్న నిరంతర సేవలకు కృతజ్ఞతగా హైదర్‌గూడ డివిజన్‌లోని ప్రముఖ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయన నిండు నూరేళ్ళ పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ, మన దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ ఈ సందర్భంగా ప్రత్యేక హారతి కార్యక్రమాన్ని చేపట్టారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు భారతదేశ ప్రగతిని కాంక్షిస్తూ నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో హైదర్‌గూడ డివిజన్‌కు చెందిన భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మరియు స్థానిక భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# ఆర్డీవో కి అభినందనలు తెలిపిన కొత్తపేట టిడిపి నాయకులు



కొత్తపేట (ఇది కద నిజం) జూన్ 10: కొత్తపేట ఆర్డిఓ గా నియమితులై పదవి బాధ్యతలు చేపట్టిన కొత్తపేట ఆర్డిఓ జీవివి సత్యనారాయణ ను కొత్తపేట టిడిపి నాయకులు స్థానిక ఆర్డిఓ కార్యాలయంల లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు సాలువ కప్పి సత్కరించారు.

ఎన్నికల సమయంలో ఆర్డిఓ సత్యనారాయణ గతంలో కొత్తపేట ఆర్డీవో గా పని చేశారు. అందరికీ పరిచయస్తులయిన ఆయన తిరిగి మరల కొత్తపేట బదిలీపై రావడంతో టిడిపి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ధర్నాల రామకృష్ణ మిద్దె ఆదినారాయణ, సిద్ధం శెట్టి సత్యనారాయణ, గుబ్బల మూర్తి తదితరులు ఆర్డీవో కి అభినందనలు తెలిపారు..

# కడప క్రికెట్ టోర్నీలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన "అడబాల"




ఆలమూరు(ఇది కద నిజం )జూన్ 10: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన అడబాల శ్రీ రామకృష్ణ ఆల్ రౌండ్ చాంపియన్ గా నిలిచారు. కడపలో ఈనెల 4న ప్రారంభమైన ఈ టోర్నమెంట్ కు రాష్ట్ర వ్యాప్తంగా 40 జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమండ్రి జట్టు-విశాఖ జట్టు తలబడ్డాయి. చివరికి రాజమండ్రి జట్టు విజయం సాధించింది. అడబాల బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి మొదటి టీమ్ పై మాన్ అఫ్ ది మ్యాచ్ బహుమతిని అందుకున్నారు. ఈ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉన్న రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఎస్సీ తిలక్ కుమార్ ప్రోత్సాహంతో ఈ జట్టు విజేతగా నిలిచింది. ప్రస్తుతం కడియం మండలం దుళ్ల విద్యుత్ లైన్ మెన్ గా పనిచేస్తున్న అడబాల జట్టు విజయానికి కీలక పాత్ర పోషించడంపై తిలక్ కుమార్ తో పాటు కెప్టెన్ బల్జి వాసు టీం ప్లేయర్స్ పలువురు విద్యుత్ శాఖ అధికారులు అభినందించారు. ఇదిలా ఉండగా ఈ జట్టు ఇప్పటి వరకు తొమ్మిది సార్లు చాంపియన్ గా నిలిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఏ జట్టూ ఇన్ని సార్లు టోర్నమెంట్ విజేతగా లేక పోవడం విశేషం.

# సీఎం ప్రారంభించపోయే నిర్మాణానికి కలెక్టర్ పరిశీలన



కాకినాడ,(ఇది కద నిజం), జూన్ 10: ప్రభుత్వాసుపత్రిలో సుమారు 62కోట్ల వ్యయంతో నిర్మించిన తల్లి పిల్లల ఆసుపత్రి విభాగంను ఈనెల 18వ తేదీన సీఎం చంద్రబాబు ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. బుధవారం ఈ విభాగంని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల తీరును కాంట్రాక్టర్ చోడే సురేష్'ను అడిగి తెలుసుకున్నారు. సురేష్ కలెక్టర్ అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. మరొక్కసారి తాను పరిశీలిస్తానని కలెక్టర్ అక్కడి అధికారులకు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసన్, కాకినాడ ఆర్టీవో ఎస్ మల్లిబాబు, కార్పొరేషన్ డిసిపి కె కృష్ణారావు, ఏపీ ఎస్ఎమ్ఐడిసిడి ఎంఎస్ చక్రవర్తి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి జితేంద్ర, ఎంహెచ్వో దళే పృధ్వి చరణ్, విశ్రాంత వైద్యుడు ఎస్వి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయం సెంటర్లో రాములవారిని దర్శించుకున్న

# రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

**సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి.**




రాజమహేంద్రవరం, (ఇది కద నిజం) జూన్ 10: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలన విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రాజమహేంద్రవరం ఏవీ ఏ రోడ్డు, శ్యామలనగర్ రామాలయం సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ సీతారాముల ఆలయంలో రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎంపీ పురందేశ్వరికి మర్యాదపూర్వకంగా బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరిస్తూ, ఈ దేవాలయం 1974 సంవత్సరంలో నిర్మించబడిందని కమిటీ సభ్యులు తెలిపారు.




# భారత చిత్రసీమలో విషాదం

## దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీ రాజా (85) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. భారతీరాజా మరణ వార్తతో తమిళ సినీ పరిశ్రమతో పాటు దేశవ్యాప్తంగా సినీ అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 2025 మార్చిలో భారతీరాజా కుమారుడు మనోజ్ భారతీ రాజా కేవలం 48 ఏళ్ల వయసులో గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఈ విషాదాన్ని భారతీరాజా తట్టుకోలేకపోయారని కుటుంబ సభ్యులు, సన్నిహితులు చెబుతుంటారు. కొడుకు అంత్యక్రియల సమయంలో ఆయన తీవ్ర ఆవేదనకు గురైన దృశ్యాలు అప్పట్లో అందరినీ కలచివేశాయి. పుత్రశోకం నుంచి పూర్తిగా కోలుకోలేకపోయిన భారతీరాజా ఆరోగ్యం క్రమంగా మరింత బలహీనపడింది.

గత ఏడాది డిసెంబర్‌లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు, ఉబ్బసం కారణంగా భారతీరాజాను చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందినప్పటికీ, వయసు పైబడటంతో ఆయన ఆరోగ్య పరిస్థితి తరచూ ఆందోళనకరంగా మారింది. కుమారుడి మరణం తర్వాత మానసికంగా కూడా ఆయన తీవ్రంగా కుంగిపోయారని కుటుంబ సభ్యులు పలుమార్లు వెల్లడించారు. 1977లో విడుదలైన 16 వయాతినిలే (తెలుగులో 'పదహారేళ్ల వయసు') చిత్రంతో భారతీరాజా దర్శకుడిగా సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. గ్రామీణ నేపథ్య కథలను సహజత్వంతో వెండితెరపై ఆవిష్కరించి తమిళ సినిమాకు కొత్త దిశను చూపించారు.

ఆ తర్వాత ఆయన తెరకెక్కించిన అనేక చిత్రాలు క్లాసిక్స్‌గా నిలిచాయి. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు 40కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి భారతీయ సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. దర్శకుడిగా మాత్రమే కాకుండా నటుడిగానూ భారతీరాజా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తనదైన నటనతో ఎన్నో విభిన్న పాత్రలను పోషించి ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల విడుదలైన తుదరుం చిత్రంలో ఆయన చివరిసారిగా కనిపించారు. అలాగే ఆయన నటించిన పులవర్ చిత్రం ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇదే నటుడిగా ఆయన చివరి సినిమా కానుంది.

గ్రామీణ జీవన శైలిని సహజంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడిగా భారతీరాజా ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఎన్నో తరాల దర్శకులకు స్ఫూర్తిగా నిలిచిన ఆయన మరణంతో దక్షిణాది చిత్రసీమ ఒక గొప్ప లెజెండ్‌ను కోల్పోయింది. భారతీరాజా సేవలను గుర్తు చేసుకుంటూ సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చిత్రాలు, ఆయన సృష్టించిన పాత్రలు, ఆయన చూపిన సినీ మార్గం ఎప్పటికీ చిరస్మరణీయంగానే నిలిచిపోతాయి.




# సైలెంట్‌గా 'బ్లాస్ట్' విధ్వంసం

సీనియర్ నటుడు, యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా మార్షల్ ఆర్ట్స్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'బ్లాస్ట్'. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్, అభిరామి కీలక పాత్రల్లో నటించగా, సుభాష్ కె. రాజ్ దర్శకత్వం వహించారు. పెద్దగా అంచనాలు లేకుండా మే 28న విడుదలైన ఈ సినిమా విడుదల అనంతరం ప్రేక్షకులు మరియు విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు అందుకుంది. దీంతో ఎలాంటి హడావిడి లేకుండానే 'బ్లాస్ట్' బాక్సాఫీస్ వద్ద నెమ్మదిగా మంచి వసూళ్లు రాబడుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ చిత్రబృందం కీలక అప్డేట్‌ను వెల్లడించింది. ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో ఈ సినిమాకు ఇప్పటివరకు 1 మిలియన్‌కు పైగా టికెట్లు బుక్ అయినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ విషయాన్ని బట్టి సినిమా సైలెంట్‌గా మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద బలమైన కలెక్షన్లు సాధిస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక రవి బస్రూర్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మించారు.

# ఇక థియేటర్లలో పూనకాలే!

నందమూరి అభిమానులకు, తెలుగు సినీ ప్రియులకు పూనకాలు తెప్పించే క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. తరతరాలుగా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న 'గాడ్ ఆఫ్ మాసెస్' నందమూరి బాలకృష్ణ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. బాలయ్య బాబు కెరీర్‌లో 111వ మైల్‌స్టోన్‌గా తెరకెక్కుతున్న చచీదీఖ111 చిత్రం నుంచి మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ విడుదల అయింది. 91 సెకన్ల నిడివి గల ఈ వీడియో, ఇంటర్నెట్ టైమ్‌లైన్స్‌ను షేక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

ఈ వీడియో చూస్తుంటే బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని విజన్, ప్రెజెంటేషన్ ఈ సినిమాలో వేరే లెవెల్‌లో ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది. ముంబై మాఫియా బ్యాక్ డ్రాప్ లోని హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్సులు, స్టైలిష్ లుక్స్, సరికొత్త మేనరిజమ్స్‌తో బాలకృష్ణను 'జెన్-జీ' ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రెజెంట్ చేయబోతున్నారని క్లారిటీ వచ్చేసింది. కమర్షియల్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే గోపీచంద్ మలినేని-బాలయ్య కాంబోలో మరో సంచలన విజయం ఖాయమని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.


మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. థమన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. బాలయ్య సినిమాలకు థమన్ ఇచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ 91 సెకన్ల గ్లింప్స్‌లో ప్రతి ఫ్రేమ్‌ను తన నెక్స్ట్ లెవెల్ మ్యూజిక్‌తో థమన్ ఎలివేట్ చేశాడు. సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో మంచు మనోజ్ కూడా కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. అరవింద్ కశ్యప్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సాయి మాధవ్ బుర్రా పవర్‌ఫుల్ డైలాగ్స్ ఈ చిత్రానికి అదనపు బలాన్ని ఇవ్వనున్నాయి.




# లాస్ట్ మినిట్‌లో బిగ్ ట్విస్ట్

## 'సింగ్ గీతం' రిలీజ్‌లో మార్పు

ఒకప్పుడు ఎన్నో క్లాసిక్, సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులకు అందించిన టాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు.. తన 94 ఏళ్ల వయసులో తీసుకొస్తున్న మూవీ 'సింగ్ గీతం'. ఇదొక మ్యూజికల్ ఫాంటసీ చిత్రంగా తెరకెక్కగా.. ఇందులో అయాన్, అహల్య బమ్రూ, షాలిని కొండేపూడి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ బ్యానర్‌పై ప్రముఖ డైరెక్టర్ నాగ్ అశ్విన్ నిర్మిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతే కాకుండా.. ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకులకు ఈ సినిమాను మరింత చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు మేకర్స్. ఇక షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 11న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేసిన విషయం తెలిసిందే. కానీ తాజాగా రిలీజ్‌ను వాయిదా వేస్తూ కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఒకరోజు ముందుకు జరుపుతూ.. 'జూన్ 12న 'కీ రైడ్' మరింత బిగ్గరగా రాబోతోంది.. సింగ్ గీతం చిత్రానికి 'క్లీన్ యూ' సర్టిఫికేషన్ లభించింది. బిగ్ స్క్రీన్‌పై అందరూ ఆస్వాదించదగ్గ అద్భుతమైన అనుభూతి ఇది. వేచి ఉండండి' అంటూ ఓ పోస్టర్ షేర్ చేశారు.




# త్రివిక్రమ్ లిస్టులోకి ప్రభాస్



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ ప్రస్తుతం విక్టరీ వెంకటేష్ హీరోగా 'ఆదర్శ కుటుంబం ఏకే 47' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాను దసరా కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా తర్వాత జూనియర్ ఎన్టీఆర్ హీరోగా 'గాడ్ ఆఫ్ వార్' అనే భారీ ప్రాజెక్ట్‌ను త్రివిక్రమ్ తెరకెక్కించనున్నట్లు చాలా కాలంగా వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మించనున్నట్లు కూడా ప్రచారం జరిగింది. ఈ అంశంపై నాగవంశీ పలుమార్లు స్పందించడంతో, వెంకటేష్ సినిమా షూటింగ్ పూర్తయ్యాక త్రివిక్రమ్-ఎన్టీఆర్ కాంబో ప్రాజెక్ట్ ప్రారంభమవుతుందనే వార్తలు బలంగా వినిపించాయి.

అయితే, తాజాగా మరో వార్త ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. వెంకటేష్ సినిమా అనంతరం త్రివిక్రమ్, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి పార్ట్ 2' చిత్రాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్-ప్రభాస్ కాంబినేషన్ నిజంగా సెట్ అయితే, ఎన్టీఆర్‌తో చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్న 'గాడ్ ఆఫ్ వార్' సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుంది? అసలు ఆ ప్రాజెక్ట్ ఉంటుందా? లేదా? అనే అనుమానాలు సినీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.